www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 12 మే 2025

స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్‌గా బూరుగుపల్లి



ప్రజాశక్తి - ఉండ్రాజవరం

నిడదవోలు మాజీ ఎంఎల్‌ఎ, తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బూరుగుపల్లి శేషారావు ఎపి స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులయ్యారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆదివారం ప్రకటించిన నామినేటెడ్ పదవుల భర్తీలో ఆయను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన అభిమానులు, నియోజకవర్గ, మండల ప్రజలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ఇష్టారీతిన స్కూల్ ఫీజులు

- ప్రైవేట్ స్కూళ్లలో అడ్మిషన్ల దందా
- పుస్తకాలు, యూనిఫారాల విక్రయాలు
- ఉక్కిరి బిక్కిరవుతున్న తల్లిదండ్రులు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

జిల్లాలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై అధికారుల నియంత్రణ కరువైంది. ఏటా ఫీజులు పెంచుతూ భారీగా వసూలు చేస్తున్నా కనీస చర్యలు తీసుకునే వారు లేరు. విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకునే వారు లేదు. నామమాత్రంగా తనిఖీ చేస్తూ వదిలేస్తున్నారు. గుర్తింపు లేని పాఠశాలలపైనా చర్యలు చేపట్టడం లేదు. కొన్ని పాఠశాలలకు నోటీసులు ఇస్తూ చేతులు దులుపుకుంటున్నారు. జిల్లావ్యాప్తంగా 650 ప్రైవేట్ పాఠశాలలు, కార్పొరేట్ స్కూళ్లు ఉన్నాయి. ఈ ప్రైవేట్ విద్యాసంస్థలల్లో లక్షా 25 వేల మంది వరకు విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఈ పాఠశాలల్లో కరోనా సమయంలో ఆన్‌లైన్ పేరిట కార్పొరేట్ విద్యాసంస్థలు తరగతులు నిర్వహించి భారీగా ఫీజులు వసూలు చేశారు.



విద్యార్థులకు నామమాత్రపు తరగతులను నిర్వహించి మొత్తం ఫీజును తీసుకున్నారు.

పాఠశాలల్లో ఫీజులు భారీగా పెంచారు

ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులు బాగా పెంచారు. కరోనా తర్వాత ఖర్చులు పెరిగాయని 30 శాతం వరకు అధికంగా వసూలు చేస్తున్నారు. ఒకటో తరగతికి రూ.20 వేలు చెల్లించాలని కోరారు. బుక్స్, డ్రెస్‌లకు అధికంగా తీసుకుంటున్నారు. ఇద్దరు పిల్లలకు గత సంవత్సరం కంటే 30 శాతం అధికంగా ఖర్చుపెట్టాల్సి వస్తోంది. ప్రైవేట్‌లో ఫీజులు ఇలా పెంచితే చదివించే పరిస్థితి లేదు. అధికారుల పర్యవేక్షణ పెరగాలి. ఫీజుల నియంత్రణ చట్టాలు పటిష్టంగా అమలు చేయాలి.

- వి.సత్యవతి, ఆర్యాపురం, రాజమహేంద్రవరం.

ఫౌండేషన్ పేరుతో అదనపు వసూలు

ప్రస్తుత విద్యాసంత్సరం మొదటి నుంచే భారీగా ఫీజులను పెంచారు. కార్పొరేట్ పాఠశాలల్లో ఐఐటి ఇతర ఫౌండేషన్‌ల పేరిట తరగతులు నిర్వహిస్తున్నామని చెప్పి సంవత్సరానికి రూ.20 వేల నుంచి రూ.60 వేల వరకు సంస్థలను బట్టి ఫీజులను వసూలు చేస్తున్నారు. కొన్ని కార్పొరేట్ విద్యాసంస్థలు నెలవారీగా రూ.1500 నుంచి రూ.3 వేల వరకు వసూలు చేస్తున్నాయి. ఫీజులు ఒకేసారి 20 నుంచి 40 శాతం వరకు పెరగడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. తరగతి గదుల్లో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. వెలుతురు, గాలితో పాటు శుభ్రత ఉండాలి. చాలా పాఠశాలల్లో రేకుల భవనాలే తరగతి గదులుగా కొనసాగుతున్నాయి. ఎలాంటి వెలుతురూ ఉండడం లేదు. పిల్లలకు ఆడుకోవడానికి కూడా గ్రౌండ్ లేదు. అనుమతుల సమయంలో విద్యాశాఖ చేతివాటం వల్ల విద్యార్థులకు క్రీడాసౌకర్యాలు ఎండమావిగా మారుతున్నాయి. పాఠశాల యాజమాన్యాలు వారికి అనుకూలమైన వారిని పెట్టుకుని పేరెంట్స్ కమిటీల సమావేశాలను కాగితాలకే పరిమితం చేస్తున్నాయి.

యథేచ్ఛగా యూనిఫారాలు, పుస్తకాల విక్రయాలు

నోటు పుస్తకాలు, బ్యాగులు, స్కూల్ డ్రెస్‌ల పేరుమీద భారీగా వసులు చేస్తున్నారు. జిల్లాలో కొన్ని ప్రైవేట్ విద్యాసంస్థలు కొన్ని తరగతులకే అనుమతులు తీసుకుని అదనపు తరగతులను నిర్వహిస్తున్నారు. విద్యాశాఖ అనుమతులు లేకుండా తరగతులను కొనసాగిస్తున్నారు. 10వ తరగతిలో వేరే పాఠశాలల పేరు మీద అనుమతులు తీసుకోవడం గాని ప్రైవేట్ క్యాండెట్‌గా పరీక్షలు రాయించడం వంటివి చేస్తున్నారు. ఇదంతా విద్యాశాఖధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదు. ఈ వ్యవహారంలో ప్రతి సంవత్సరం భారీగానే చేతులు మారుతున్నాయి. నగరంలో పలు చోట్ల ప్రైవేట్ విద్యాసంస్థలు నిర్వాహకులు గుర్తింపు లేకుండానే పాఠశాలల నిర్వహణ చేస్తున్నారు.

నేడు యథావిధిగా పిజిఆర్ఎస్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న పిజిఆర్ఎస్ కార్యక్రమంలో సోమవారం జిల్లాలో యథావిధిగా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ అర్జీలను ఇవ్వడం కోసం '1100 - మీ కోసం కాల్ సెంటర్'కు ఫోన్ ద్వారా ఫిర్యాదు నమోదు చేయయడం, నమోదైన అర్జీ యొక్క స్థితిగతులు తెలుసుకోవచ్చునని తెలిపారు. జిల్లా కలెక్టరేట్‌లో, డివిజన్, మున్సిపల్, మండల కేంద్రంలో మే 12 ఉదయం 10.00 గంటల నుంచి మధ్నాహ్నం 1.00 గంటల వరకూ ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తామని కలెక్టర్ తెలిపారు. ప్రత్యేక అధికారులు, జిల్లా, డివిజన్ మండల, మున్సిపల్ క్షేత్ర స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరవ్వాలని స్పష్టం చేశారు. ప్రజలు వ్యయ ప్రయసలు పడి ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చి ఫిర్యాదు చెయ్యకుండా 1100 టోల్ ఫ్రీ నెంబర్‌కు నేరుగా తమ సమస్యలను తెలియజేయడం ద్వారా కూడా పరిష్కారం అయ్యే దిశగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. మీ కోసం ద్వారా నమోదు చేసిన ఫిర్యాదు యొక్క స్థితి తెలుసుకునే అవకాశం ఉందన్నారు. సత్వర పౌర సేవలను పొందేందుకు ప్రభుత్వం అమల్లోకి తీసుకు వచ్చిన వాట్సాప్ గవర్నెన్స్ నెంబర్ 9552300009ను తమ సెల్ ఫోన్లలో నిక్షిప్తం చేసుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే పలు పౌర సేవలు అందుబాటులో తీసుకుని వచ్చినట్టు తెలిపారు. నీటి తీరువా, తదితర పన్నుల చెల్లింపులు కూడా వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా చెల్లించే అవకాశం ఉందన్నారు. రెవెన్యూ పరమైన సేవలు అందుబాటులోకి రావడం వల్ల అధికారుల చుట్టూ తిరిగే అవసరం లేకుండా మీ మొబైల్ ఫోన్‌కే ఆయా సేవలు అందుబాటులోకి తీసుకుని రావడం విశేషం అన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యాన సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి-నిడదవోలు

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. రోటరీ ఇంటర్నేషనల్ జిల్లా గవర్నర్ రొటేరియన్ ఎం.వెంకటేశ్వరరావు తన అధికార పర్యటన సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు కెవి.రత్నకుమార్, సెక్రెటరీ ఎకె.చైతన్య, గవర్నర్‌కు ఘన స్వాగతం పలికారు. అనంతరం డి.ముప్పవరం గ్రామంలో వర్రే చంద్రరావు, సత్యవతి దంపతులు ఏలూరు ఆశ్రమ హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత మెగా మెడికల్ క్యాంపు ఉదయం 8 గంటల నుండి సాయంత్రం మూడు గంటలకు హైస్కూల్ ఆవరణంలో నిర్వహించారు. స్త్రీల వైద్యులు, చెవి ముక్కు, చర్మవ్యాధి, కంటిచూపు, కీళ్ల నొప్పులు, రేడియాలజీ, గుండె పరీక్షలు, సుగర్, బిపి పరీక్షలు నిర్వహించి సుమారు 300 మందికి మందులు పంపిణీ చేశారు. సాయిరామ్ డెంటల్ హాస్పిటల్ ఆధ్వర్యాన ఉచితంగా దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. రొటేరియన్ ఎం.అమ్మిరాజు, మీనాక్షి దంపతులు క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, గోపిరెడ్డి శ్రీను, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నకు స్వాగతం పలుకుతున్న సభ్యులు

రైతులకు పవర్ టిల్లర్స్ అందజేత

ప్రజాశక్తి - కొవ్వూరు

వ్యవసాయాన్ని ఆదుకొనేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో పని చేస్తోందని టిడిపి నాయకులు పెండ్యాల అచ్చిబాబు అన్నారు. ఆదివారం కొవ్వూరు మండలం పసివేదల గ్రామంలో వ్యవసాయ శాఖ వారి ఆధ్వర్యంలో ఫార్మ్ మెకానైజేషన్ పథకం ద్వారా ముగ్గురు రైతులకు పవర్ టిల్లర్స్ అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పెండ్యాల అచ్చిబాబు రైతులకు వీటిని అందజేసారు. పవర్ టిల్లర్ ధర రూ.2.29 లక్షలు సబ్సిడీ రూ.లక్ష లభిస్తుందని అచ్చిబాబు తెలిపారు. వ్యవసాయంలో అధికది గుబడులు సాధించడం ఎంత ముఖ్యమో ఖర్చులు తగ్గించుకొని ఆధునిక వ్యవసాయ పద్ధతులు అనుసరించడం అంతే ముఖ్యమని కొవ్వూరు ఎంఎల్‌ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. అనంతరం గ్రామస్తులు ఏర్పాటు చేసిన సిసి కెమెరాలతో పాటు ఉపాధి నిధులు రూ.14 లక్షలతో నిర్వహించిన సిసి రోడ్డును అచ్చిబాబు, ఎంఎల్‌ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కంటమని రామకృష్ణ, సర్పంచ్ తుంపల్లి సింహాచలం, గారపాటి రామచంద్రరావు, బేతిన నారాయణ, బిజెపి జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, ఎఎంసి చైర్మెన్ నాదెండ్ల శ్రీరామ చౌదరి, శ్రీనివాస్, చంద్రశేఖర్ ఉన్నారు.

పవర్ టిల్లర్లు అందజేస్తున్న పెండ్యాల అచ్చిబాబు

మహిళలకు దుస్తులు పంపిణీ చేస్తున్న తోట

మహిళలకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి-తాళ్లపూడి

ప్రతి మనిషీ ఎన్ని దానధర్మాలు సేవా కార్యక్రమాలు చేస్తున్నప్పటికీ తల్లి రుణం తీర్చలేనిదని వైసిపి రాష్ట్ర నాయకులు పెద్దేవం గ్రామ ఉప సర్పంచ్ తోట రామకృష్ణ అన్నారు. మాతృ దినోత్సవం సందర్భంగా ఆదివారం పెద్దేవం గ్రామంలో పలువురు మహిళలకు రామకృష్ణ దుస్తులు పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ తిగిరిపల్లి వెంకట్రావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు బట్టు సుబ్బారావు, నామా ప్రకాశం, నాయకులు వై.సత్యనారాయణ, జి.వెంకటేష్ పాల్గొన్నారు.

ఘనంగా అరహ పుట్టినరోజు

ప్రజాశక్తి-గోపాలపురం

మండలంలోని బీమోలు గ్రామ మాజీ సర్పంచ్, టిడిపి సీనియర్ నాయకులు గంధ్రోతు శ్రీనివాసరావు మనవరాలు, ఫాతిమా, వివి సూర్య మణిధర్ దంపతుల కుమార్తె జి.అరహ పుట్టినరోజు వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ పుట్టినరోజు వేడుక గోపాలపురం కెఎస్.రెడ్డి ఫంక్షన్ హాల్లో ఎంతో అంగరంగ వైభవంగా ఏర్పాటు చేశారు. ఈ పుట్టినరోజు వేడుకలకు స్థానిక ఎంఎల్‌ఎ మద్దిపాటి వెంకటరాజు, మాజీ హోమ్ మంత్రి తానేటి వనిత, ప్రముఖులు హాజరయ్యారు.

డిఎస్‌సిపై 13న అవగాహనా సదస్సు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

ఈ నెల 13న డిఎస్‌సి పరీక్షపై డివైఎఫ్‌ఐ, యుటిఎఫ్ ఆధ్వర్యాన అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్టు డివైఎఫ్‌ఐ జిల్లా కన్వీనర్ వి.రాంబాబు తెలిపారు. రాజమహేంద్రవరంలోని ఆనం కళాకేంద్రంలో ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ సదస్సులో పోటీ పరీక్షల నిపుణులు మాజీ ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా డివైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వి.రాంబాబు మాట్లాడుతూ జిల్లాలో ఉన్న డిఎస్‌సి అభ్యర్థులు ఈ సదస్సును సద్వినియోగం చేయసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో నిరుద్యోగుల పోరాట ఫలితంగా డిఎస్‌సి నోటిఫికేషన్ సాధించుకున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో ఏడేళ్ల తర్వాత విడుదలైన ఈ నోటిఫికేషన్‌కు నిరుద్యోగులు సన్నద్ధం అవ్వడానికి, పరీక్షకు కనీసం 90 రోజుల సమయం లేకపోవడంతో తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. వయోపరిమితి 44 సంవత్సరాలు కేటాయించడంతో ఇప్పటికే డిఎస్‌సి నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తూన్న వారిలో కొంతమంది వయోభారంతో ఇబ్బంది పడుతున్న వారికి ఇది చాలా ఇబ్బంది కలిగిన విషయం అన్నారురు. వయోపరిమితి 47 ఏళ్లకు పెంచాలన్నారు. జిల్లాలో వయోపరిమితి పెరిగి అర్హత కోల్పోయిన వారు రెండు వేలకు పైన ఉన్నారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో రాష్ట్ర ప్రభుత్వం 44 ఏళ్ల ఉన్న వయోపరిమితిని 47 సంవత్సరాలకు పెంచి, ప్రభుత్వ ఉద్యోగులకు సన్నద్ధమవడానికి వయోపరిమితి పెంచిందన్నారు. ఆంధ్రాలో కూడా 47 ఏళ్ల వరకు అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. అంతేకాక నార్మలైజేషన్ రద్దు చేసి జిల్లాకు ఒకే పేపర్ నిర్వహించాలన్నారు. నార్మలైజేషన్ విధానం వల్ల ఒక మార్క్, అర మార్కులో అర్హత కోల్పోయినవారు వందల సంఖ్యలో ఉంటున్నారని, ఓపెన్ డిగ్రీలో పాస్ అయిన వారికి కూడా అవకాశం కల్పించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం టెక్నికల్ సమస్యలను త్వరగా పరిష్కరించాలని, ఒకే పేపర్ జిల్లా అంతట నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా డివైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో డిఎస్‌సి అభ్యర్థులతో కలిసి ఆందోళన పోరాటాలు చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమం డివైఎఫ్‌ఐ కమిటీ సభ్యుల టి.రాజేష్, జె.సూరిబాబు, బి.కన్నబాబు దొర, కె.చిన్నలరావు పి.వెంకటరమణ, వీరబాబు, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

అవగాహన సదస్సు పోస్టర్ ఆవిష్కరిస్తున్న డివైఎఫ్‌ఐ నాయకులు

విగ్రహాల ఆవిష్కరణలో పాల్గొన్న శేషారావు, తదితరులు

మహనీయుల విగ్రహాల ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని వేలివెన్నులో ఆదివారం డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలను, పున్న నిర్మించిన మందిరంలో, నిడదవోలు మాజీ ఎంఎల్‌ఎ బూరుగుపల్లి శేషారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహనీయుల విగ్రహాల ఆవిష్కరణలతో పాటు అఖండ భారతావనికి వారు చేసిన సేవలు, పోషించిన పాత్ర నేటి యువత ఆదర్శంగా తీసుకొని, ప్రజాసేవా కార్యక్రమాలలో పాలు పంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అత్తిలి సత్యనారాయణ, ఉప సర్పంచ్ బూరుగుపల్లి శ్రీనివాస్, వేలివెన్ను గ్రామ దత్తత స్వీకర్త బూరుగుపల్లి శ్రీనివాస్, కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్యం కాపాడుకోవాలి

ప్రజాశక్తి-కడియం

ఆరోగ్యమే మహాభాగ్యమని, ఆరోగ్యానికి మించిన ఆస్తి మరొకటి లేదని ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కడియపులంక సర్పంచ్ పాఠంశెట్టి రామ్‌జీ అన్నారు. కడియపులంక పంచాయతీ ఆవరణలో బిగ్ టివి, రాజమహేంద్రవరం ఆకాశం మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సౌజన్యంతో సర్పంచ్ రామ్‌జీ పర్యవేక్షణలో ఆదివారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ రామ్‌జీ, ఆకాశం హాస్పిటల్ మార్కెటింగ్ మేనేజర్ హిమశంకర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఎంత ధనవంతుడైనా ఆరోగ్యాన్ని కొనలేరని, అనారోగ్యం సోకకుండా చూసుకోవాలని అన్నారు. వేసవి కాలంలో ప్రజలు అనారోగ్యానికి గురికాకుండా వైద్యుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. ఈ శిబిరంలో వందలాది మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బిగ్ టివి యాజమాన్యానికి, ఆసుపత్రి వైద్యులకు సర్పంచ్ రామ్‌జీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బోడపాటి రాజేశ్వరి, మల్లు బాబీ, కట్టా శివ, గట్టి సూరిబాబు, బండి నాగమణి, పట్టా బాలు, నూనె వెంకటేశ్వరరావు, కోమలి రామకృష్ణ, చీకట్ల చంటి పలువురు పాల్గొన్నారు.

వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ రామ్‌జీ

ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి పెరవలి

మండలంలోని కాకరపర్రు శ్రీ వెంకట శాస్త్రి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం ఆదివారం స్కూల్ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. 1990-1995 బ్యాచ్ విద్యార్థులు 30 ఏళ్ల తరువాత స్నేహితులు కుటుంబ సభ్యుల కలయిక ఒక అనుభూతిగా ఆనంద్ ఉత్సాహాల మధ్య గడిపారు. విద్య అభ్యసించిన తోటి స్నేహితులు పలు రంగాల్లో స్థిరపడి నేడు ఆత్మీయ సమ్మేళ కార్యక్రమంలో కలవడంతో ఆనాటి తీపి గుర్తులు నెమరు వేసుకున్నారు. అనంతరం విద్య నేర్పిన గురువులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఉపాధ్యాయుల తదితరులు పాల్గొన్నారు.

అమర జవాన్‌లకు సంఘీభావంగా ర్యాలీ

ప్రజాశక్తి-పెరవలి

మండలంలోని కానూరు గ్రామంలో ఆదివారం అమర్ జవాన్‌లకు సంఘీ భావంగా భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్ రాజు, ముల్లపూడి రాజు, అనపర్తి సాంబమూర్తి, ఆలం సుబ్బారావు, మిలటరీ బ్రహ్మం, ఆకుల శ్రీను, పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న సేవా సమితి సభ్యులు

కార్టూ'నిజం'



దళిత వాడల్లో మురుగునీటి కష్టాలు

ప్రజాశక్తి - సీతానగరం

సీతానగరం మండలం ఇనుగంటివారి పేటలోని దళితవాడలు అపరిశుభ్రతతో అల్లాడిపోతున్నాయి. పక్కా డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం, ఉన్న డ్రైనేజీలు పూడికతో నిండిపోవడంతో మురుగునీరు వీధుల్లో పొంగి పొర్లుతూ స్థానికులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. ఈ సమస్య వల్ల దోమలు, ఈగల బెడద పెరిగి, ప్రజలు వివిధ రకాల వ్యాధుల బారిన పడుతున్నారు. గ్రామ పంచాయతీ అధికారులు నామమాత్రంగా పూడికతీత పనులు చేపట్టి చేతులు దులుపుకుంటున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేవలం తాత్కాలిక పరిష్కారాలతో సరిపెట్టడం వల్ల సమస్య మళ్లీ తిరగబెడుతోందని వారు వాపోతున్నారు. పారిశుధయ లోపం వల్ల తరచూ అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని, ముఖ్యంగా చిన్నపిల్లలు, వద్దులు తీవ్రంగా ప్రభావితం మవుతున్నారని వారు పేర్కొన్నారు. ఈ మురుగునీటి సమస్య కారణంగా వీధుల్లో నడవడానికి కూడా ఇబ్బందిగా ఉందని, దుర్వాసనతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారని దళితవాడల నివాసితులు తెలిపారు. ఈ సమస్యపై సంబంధిత అధికారులకు పలుమార్లు విన్నవించినా, ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం లభించలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే అధికారులు స్పందించి దళిత వాడల్లో డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరచాలని, శాశ్వత పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. పారిశుధ్యాన్ని మెరుగు పరిచి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని వారు గుర్తు చేస్తున్నారు. ఈ సమస్యకు తక్షణమే పరిష్కారం లభించకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని స్థానికులు హెచ్చరించారు.

సిసి రోడ్డుపై పొంగి ప్రవహిస్తున్న మురికి నీరు

తులసి మొక్కలు పంపిణీ చేస్తున్న ఇఒ దంపతులు

ఆలయంలో తులసి మొక్కల పంపిణీ

ప్రజాశక్తి-పెరవలి

మండలంలోని అన్నవరప్పాడు వెంకటేశ్వర స్వామి కల్యాణ ఉత్సవాల్లో భాగంగా 4వ రోజు ఆదివారం దేవస్థానం ప్రాంగణంలో తులసి బందార్చన నిర్వహించారు. తులసి మొక్కలకు అర్చనలు జరిపి అనంతరం దేవస్థానం కార్య నిర్వహణ అధికారి మీసాల రాధాకృష్ణ దంపతులు తులసి మొక్కలు పంపిణీ చేశారు. స్వామివారి కల్యాణోత్సవాలకు అధిక సంఖ్యలో యాత్రికులు ఆదివారం పోటెత్తారు. వారికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా చలువ పందిళ్లు, తాగునీరు ఉదయం సాయంత్రం స్వామివారి అన్న ప్రసాదం దాతల సహకారంతో ఏర్పాటు చేసినట్టు దేవస్థానం ఇఒ మీసాల రాధాకృష్ణ తెలిపారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ప్రయివేటు బ్యాంక్ ఉద్యోగి మృతి

ప్రజాశక్తి - ఆలమూరు

216 ఎ జాతీయ రహదారిపై మండలంలోని చొప్పెల్ల పంట కాలువ వద్ద ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక ప్రయివేటు బ్యాంక్ ఉద్యోగి మృతి చెందాడు. ఎస్ఐ ఎం.అశోక్ తెలిపిన వివరాల ప్రకారం..మడికి శివారు చిలకలపాడుకు చెందిన కొత్తపల్లి ఆనంద్ వెంకటరత్నం హరీష్(32) రాజమహేంద్రవరం ఐసిఐసిఐ బ్యాంక్ నందు క్రెడిట్ మేనేజర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం సెలవు రోజు కావడంతో రాత్రికి గ్రామంలో తన స్నేహితుని పెళ్లికి వెళ్లేందుకు ద్విచక్ర వాహనంపై రావులపాలెం వెళ్తున్నాడు. ఈ క్రమంలో జాతీయ రహదారిపై బైక్ అదుపుతప్పి చొప్పెల్ల లాకుల సమీపంలో ఉన్న పంట కాలువ వంతెన కాంక్రీట్ రైలింగ్‌ను ఢీకొంది. దీంతో ఆనంద్ తలకు బలమైన గాయాలు తగిలి ఘటన స్థలంలోనే మతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి వచ్చిన సమాచారంతో ఎస్ఐ అశోక్ తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. అలాగే మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియా హాస్పిటల్‌కి తరలించారు. మృతుడికి భార్య, ఒక చిన్న పాప ఉన్నారు.

బస్సు ఢీకొని భార్యాభర్తలకు గాయాలు

ప్రజాశక్తి-పెరవలి

మండలంలోని ఖండవల్లి జాతీయ రహదారిపై ఆదివారం బైకును బస్ ఢీకొని భార్యాభర్తలకు గాయాలయ్యాయి. తణుకు నుంచి రావులపాలెం వైపు వెళుతున్న బైపాస్ ఎక్స్‌ప్రెస్ ఖండవల్లి సెంటర్లో రావులపాలెం వైపు బైకుపై ఇద్దరు పిల్లలతో వెళుతున్న భార్యాభర్తలు కపిలేశ్వరపు రామకష్ణ, ఆదిలక్ష్మి ఢీకొంది. ఈ సంఘటనలో భార్యాభర్తలకు గాయాలయ్యాయి. వారిని తణుకు జిల్లా ప్రాంతీయ హాస్పిటల్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు

కోనేరులో గుర్తు తెలీని మృతదేహం

ప్రజాశక్తి - కోరుకొండ

కోరుకొండ శ్రీలక్ష్మీ నరసింహస్వామి కోనేటిలో గుర్తుతెలియని మృతదేహం స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం కోరుకొండ విఆర్ఓ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కోనేటిలో సుమారు 45 ఏళ్ల వయస్సు గల మృతదేహాన్ని బయటకు తీసినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహం గుర్తింపు కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు పోలీసులు తెలిపారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు కోరుకొండ పోలీస్ స్టేషన్‌లో వివరాలు తెలపాలన్నారు.

ట్రాక్టర్ బైకు ఢీకొని యువకుడు మృతి

ప్రజాశక్తి - కొవ్వూరు

కొవ్వూరు మండలం దొమ్మేరు గ్రామం శివారు ఇజికె రోడ్డులో ట్రాక్టర్ బైకు ఢీకొని యువకుడు మృతి చెందాడు. దొమ్మేరు గ్రామానికి చెందిన చిగురుపల్లి విద్యాసాగర్ (20) కాపవరం వైపు నుండి దొమ్మేరు వస్తుండగా దొమ్మేరు గ్రామ శివారులో గడ్డితో వెళ్తున్న ట్రాక్టర్ ఢీకొనడంతో బైకుపై వెళుతున్న విద్యాసాగర్ అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

గొల్లప్రోలులో...

మండలంలోని చేబ్రోలు గ్రామంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాడేరు జిల్లా ముంచుపట్టు మండలం మచ్చేపురం గ్రామానికి చెందిన కోడ మోహన్(21) చేబ్రోలు లక్ష్మీపురం వద్ద ఉన్న చేపల చెరువులో పని చేస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో యజమాని యాళ్ల వెంకటరమణ సూచనతో చేపల చెరువు పనివారలకు భోజనాలు తీసుకురమ్మన్నారు. దీంతో మోహన్ మోటార్ సైకిల్ పై వెళుతుండగా చేబ్రోలు లక్ష్మీపురం మలవరం గేటు సమీపంలో మట్టితో వస్తున్న ట్రాక్టర్ బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై మృతిని సోదరుడు కొడ గోవింద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు.

ఇద్దరిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మద్యం తాగి వాహనం నడుపుతున్న ఇద్దరు వ్యక్తులపై పోలీసులు కేసులు నమోదు చేశారు. వారి వివరాలు ప్రకారం .. ఆత్రేయపురం రేవులో ఆదివారం సాయంత్రం వాహనాలను పోలీసులు తనిఖీ చేస్తున్నారు. ఈ సమయంలో ఇరువురు ద్విచక్ర వాహనదారులు మద్యం తాగి ఉండడంతో వారి బ్రీతింగ్ ఎనలైజర్ మిషన్‌తో పరీక్షించారు. వారిద్దరూ పరిమితి కంటే ఎక్కువ మద్యం తాగినట్టు పాయింట్లు రావడంతో ఇరువురుపై కేసును నమోదు చేసినట్లు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి - కరప

మండలంలోని గురజనాపల్లి గ్రామ శివారులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ముందస్తుగా వచ్చిన సమాచారంతో ఆదివారం ఎస్ఐ టి.సునీత ఆధ్వర్యంలో సిబ్బంది పేకాట శిబిరంపై దాడి చేసి ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.2,730 నగదును స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బంగారు గొలుసు చోరీ

ప్రజాశక్తి - కరప

కరప గ్రామంలో ఒక అమ్మాయి మెడలోంచి 2 కాసుల బంగారు గొలుసును లాక్కొని పోయిన సంఘటనపై కేసు నమోదైనట్లు ఎస్ఐ టి.సునీత తెలిపారు. కాకినాడ గైగలపాడుకు చెందిన నక్క లక్ష్మీ, అలేఖ్య, హన్సిక కలిసి కరప మండలం జడ్.భావారంలో జరుగుతున్న వనుములమ్మ జాతరకు వస్తున్నారు. వేలంగి వైపు బైక్ పై వెళ్తున్న ఒక గుర్తు తెలియని వ్యక్తి అలేఖ్య వెనుకనే వస్తూ కరప శివారు డంపింగ్ యార్డ్ వద్ద హన్సిక మెడలో ఉన్న బంగారపు గొలుసును లాక్కుని పోయాడు. దీంతో బాధితిరాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పంట కాలువల్లో పూడికతీతకు చర్యలు

ఇరిగేషన్ ఎస్ఇ కె.గోపీనాథ్

ముఖాముఖి

ప్రజాశక్తి - అమలాపురం

వేసవి అనంతరం కాలువలకు సాగునీరు విడుదల చేయకముందే పంట, మురుగు కాలువల్లో పూడికతీత పనులు చేపట్టాలి. జులై నుంచి గోదావరి వరదల సీజన్ ప్రారంభం అవుతుంది. ఈ లోగా బలహీన ఏటిగట్లు, అవుట్ ఫాల్ స్లూయిజ్‌లకు మరమ్మతులు చేపట్టాలి. ఈ నేపథ్యంలో జలవనరుల శాఖ ధవళేశ్వరం సర్కిల్ ఎస్ఇ కె.గోపీనాథ్ ప్రజాశక్తి ముఖాముఖి నిర్వహించింది. ఈ సందర్భంగా పలు అంశాలపై ఆయన వివరించారు.

గోదావరి వరదల నివారణకు సన్నద్ధంగా ఉన్నారా

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో బలహీన ఏటిగట్లు, నూతన అవుట్‌ఫాల్ స్లూయిస్ నిర్మాణం, కొన్ని అవుట్‌ఫాల్ స్లూయిజ్‌లకు శాశ్వత రక్షణ పనులు, ఫ్లడ్ స్టోర్స్‌లో వరద రక్షణ సామగ్రి ఏర్పాటు వంటివి చేసేందుకు నిర్ణయించాం.

వచ్చే వరదల్లో రక్షణ చర్యలకు కేటాయింపులు ఉన్నాయా

ప్రత్యేకించి వరద రక్షణకు రూ.16.90 కోట్లు కేటాయించాం. వైనతేయ ఎడమ ఏటిగట్టు పరిధిలో నాలుగు అవుట్‌ఫాల్ స్లూయిజ్‌లకు శాశ్వత పనులు పూర్తయ్యాయి. కుడి ఏటిగట్టు వశిష్ట ఎడమ ఏటిగట్టు రూ.13.20 కోట్లతో వాడబోది, బచ్చులబంద, కడలి, రాళ్లకాలువ అవుట్‌ఫాల్ స్లూయిజ్‌లను నిర్మించాలి. గౌతమి కుడి ఏటిగట్టు పరిధి బూలవారిమొండి వద్ద రూ.32 లక్షలతో గట్టును పటిష్ట పరిచాం. గొల్లగరువు, జి.మూలపొలం అవుట్‌ఫాల్ స్లూయిజ్ నిర్మాణం చేపట్టేందుకు ప్రాధాన్యత ఇచ్చాం.

పంట కాలువల్లో పూడికతీత పనులు ఏ మేరకు నిర్వహిస్తారు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పంట, మురుగు కాలువల్లో పూడికతీత, తూడు, గుర్రపుడెక్క తొలగింపు పనులు 853 గుర్తించాం. రూ.35.81 కోట్లతో పనులు చేపట్టేందుకు ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకున్నాం. నిధులు విడుదల కావాల్సి ఉంది.

ఈ పనులు సాగు నీరు విడుదల చేసే లోపు పూర్తి చేయగలరా

పూడికతీత పనులు కాలువలకు సాగు నీరు విడుదల చేసే లోగా పూర్తిచేస్తాం. రూ.10 లక్షల లోపు పనులను సాగునీటి సంఘాల ద్వారా చేయిస్తాం. ఆ పైన విలువైన వాటిని స్టార్ట్ టెండర్లు పిలిచి చేపడతాం. ఏదేమైనా కాలువలకు సాగునీరు విడుదల చేయక ముందే పూడికతీత పనులు పూర్తి చేస్తాం.

కాలువల ఆక్రమణలు, కాలుష్యం నివారణకు చర్యలు

కాలువలను ప్రక్షాళన చేయాలి. వీటిల్లో మురికినీటి తూరలను తొలగించేందుకు గ్రామ పంచాయతీలు చర్యలు తీసుకోవాలి. ఇప్పటికే కార్యదర్శులకు నోటీసులు జారీ చేశాం. ఆక్రమణలు తొలగించేందుకు అందరి సహకారం ఎంతో అవసరం.

ఆక్రమణలను గుర్తించడానికి ఏ విధమైన ఏర్పాట్లు చేస్తున్నారు

గోదావరి డెల్టా సిస్టమ్‌లో పంట, మురుగు కాలువలు, వివిధ కట్టడాలు ఏ స్థాయిలో ఉన్నాయి అనే దానిపై లైడార్ సర్వే చేయిస్తాం. ఈ సర్వే చేయడానికి రూ.16.07 కోట్లు ఖర్చవుతుంది. ఈ సర్వే ద్వారా ఆక్రమణలు గుర్తించి వారికి నోటీసులు అందజేస్తాం.

ఉప్పాడకు తాగునీటి కష్టాలు

-పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

సముద్ర తీర ప్రాంతంలోని ఉప్పాడ గ్రామ ప్రజలకు తాగునీటి కష్టాలు తీరటం లేదు. అధికారుల వద్ద ఎన్నిసార్లు మొరపెట్టుకున్న స్పందించడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉప్పాడ గ్రామంలో ఉన్న నాయకర్ కాలనీ 1, 2 తోపాటు మాయాపట్నం తదితర ప్రాంతాలకు తాగునీరు అందడం లేదు. ఉప్పాడ-పిఠాపురం ప్రధాన రహదారిలో ఉన్న పైపులైను మరమ్మతులకు గురయింది. దీంతో నీరు ముందుకు వెళ్లడం లేదు. ఒకపక్క తాగునీరు వృధా అవుతుండగా, మరోపక్క ఆ నీటిపై ఆధారపడిన ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. గోతులు తొవ్వుకుని భూమిలోకి పైపును అమర్చి నోటితో తాగునీరు లాగుతూ బిందుల్లో నింపుకుంటూ అష్ట కష్టాలు పడుతున్నారు. వాటర్ ట్యాంకుల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నా పది నిమిషాలకే ట్యాంకర్ నిండికుంటుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకపక్క ఎండ తీవ్రతతో నీటి వినియోగం అధికం అయిందని, అయితే గొంతు తడుపుకోవడానికి నీరు అందడం లేదని మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. కనీసం ప్రయివేటు ఆర్ఒ ప్లాంట్ల వద్ద నీటిని కొనుగోలు చేద్దామన్న వేట నిషేధ సమయం కావడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు వాపోతున్నారు. ప్రభుత్వం మాత్రం సుజల పథకం ద్వారా ఇంటింటికి కుళాయిని వేస్తామని ఆర్భాటం తప్ప కనీసం వీధి కుళాయిలకు సైతం తాగునీరు సరఫరా చేయడం చేయడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఉప్పాడ గ్రామంలో తాగునీటి కష్టాలను తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతులు చేయకపోవడంతో వృధాగా పోతున్న నీరు

ఖాళీ బిందెలతో మహిళల పాట్లు

ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎగసి పడుతున్న రక్షిత జలాలు

ప్రజాశక్తి - సామర్లకోట



ట్రాన్స్‌ఫార్మర్‌పై పడుతున్న నీళ్లు

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై రక్షిత జలాలు పై ఎగసిపడుతున్నాయి. మండలంలోని వేట్లపాలెం గణపతి ఆలయ సమీపంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మ మీద కుళాయి పైప్‌లైన్ లీకేజీతో నీళ్లు ఎగిసిపడుతున్నాయి. అటుగా వెళ్తున్న స్థానికులు ఎప్పుడూ ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శనివారం నుంచి ఈ పరిస్థితి ఉందని ఈ ప్రాంతవాసులు చెబుతున్నారు. ఎటువంటి ప్రమాదం సంభవించక ముందే విద్యుత్, పంచాయతీ అధికారులు తగుచర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఉత్సాహంగా సమ్మర్ క్యాంపు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో నిర్వహిస్తున్న 5వ రోజు వేసవి క్యాంపు ఉత్సాహంగా జరిగింది. తొలుత కరాటే, వ్యాయామంలో ఉదయం యోగేష్, లోకేష్ శిక్షణ ఇచ్చారు. తెలుగు పద్యాలపై ఉపాధ్యాయులు అజయ్‌కుమార్, బాల గీతాలు పాడటంలో ఉపాధ్యాయురాలు బేబీరత్నం, హిందీ బోధనపై విమలారాణి, డ్రాయింగ్‌లో గూనూరు వెంకటరమణ, దేశభక్తి గీతాలపై దారపురెడ్డి కృష్ణ శిక్షణ ఇచ్చారు. మిషన్ అన్నపూర్ణ సహాయనిధి ప్రతినిధి వెలగా త్రిపుర పుట్టినరోజు సందర్భంగా మిషన్ అన్నపూర్ణ సహాయనిధి వ్యవస్థాపకులు దేవత రాజేష్‌కుమార్ విద్యార్థులకు స్నాక్స్ పంపిణీ చేశారు. ఈ క్యాంపులో రొంగల అరుణ్‌కుమార్, కూనిరెడ్డి రవి, అమృత, నమ్రత, మణికంఠ పాల్గొన్నారు.

భీమేశ్వరుని సేవలో కార్తికేయ మిశ్రా

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక భీమేశ్వర స్వామి వారి ఆలయంలో ముఖ్యమంత్రి అడిషనల్ సెక్రటరీ కార్తికేయ మిశ్రా కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నంది మండపంలో వారికి దేవస్థానం సిబ్బంది స్వామి చిత్రపటాలు, ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ ఎస్.మల్లిబాబు, ఆలయ సూపరింటెండెంట్ ఈశ్వరరావు, అర్చకులు పాల్గొన్నారు.

మిశ్రాకు చిత్రపటాన్ని అందిస్తున్న అధికారులు

గంగాలమ్మను దర్శించుకున్న ఎంఎల్ఎ

ప్రజాశక్తి - కరప

మండలంలోని పెద్దపురప్పాడులోని గంగాలమ్మ అమ్మవారిని ఎంఎల్ఎ పంతం నానాజీ, కుడా ఛైర్మన్ తుమ్మల రామస్వామి దర్శించుకున్నారు. ఆదివారం గంగాలమ్మ అమ్మవారి జాతర ప్రారంభం అయింది. ఈ సందర్భంగా వారు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి యాత్రికులు పెద్దఎత్తున తరలివచ్చారు. మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పబ్బినీడి ప్రదీప్, బిరద బాబులు, తలాటం గంగాధర్‌రావు, గొల్లపల్లి ప్రసాద్, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

పలివెలలో ఘనంగా అంబేద్కర్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - కొత్తపేట

మండలంలోని పలివెల పెద పేటలో నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల బాల వీరాంజనేయ స్వామి, అమలాపురం ఎంఎల్ఎ అయితాబత్తుల ఆనందరావు, పి.గన్నవరం ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ, కొత్తపేట జనసేన పార్టీ ఇన్‌ఛార్జి బండారు శ్రీనివాసరావు, ఆకుల రామకష్ణ, ఐఎఎస్ అధికారి ఈతకోట రమేష్ కుమార్ పాల్గొన్నారు ముఖ్య అతిథులు మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత, అపర మేధావి అయినటువంటి అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా యువత నడవాలన్నారు. ఆయన పేదలకు ఎన్నో మార్గాలను కల్పించి పూల బాటలు వేశారన్నారు. వాటిని మనకున్న, కలిగిన అవకాశాలను సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఎదుటివారికి ఇబ్బంది కలిగించకుండా నడవడమే ఆయనకు గౌరవం కలిగించినట్లన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్ కుమార్ వడయార్, గ్రామ సర్పంచ్ సాగే లక్ష్మి శ్రీనివాస్, బూస్ట్ విజయలక్ష్మి, నెల్లి లక్ష్మీపతిరావు, చవల జగన్నాథం, బీర్ ఇస్సాక్, కూటమి నాయకులు, అంబేద్కర్ అభిమానులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న నేతలు

చిన్నయ్యదొరను కలిసిన లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి - సామర్లకోట

జై భారత్ నేషనల్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, భారత్ మాత సేవ పరిషత్ అధ్యక్షులు డాక్టర్ దొరకపూడి చిన్నయ్య దొరను రిటైర్డ్ జెడి లక్ష్మీనారాయణ శనివారం రాత్రి కలిసి మాట్లాడారు. చిన్నయ్య దొర సేవలను లక్ష్మీనారాయణ కొనియాడారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ చెన్నై ధర శాలువాతో సత్కరించి మెమెంటోతో అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బిక్కిన విశ్వేశ్వరరావు, పుప్పాల నాగ గోవిందు, బొలిశెట్టి రామ్‌కుమార్, వల్లూరి బుల్లయ్య, కోన రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మీనారాయణను సత్కరిస్తున్న చిన్నయ్యదొర

థర్డ్ సెమిస్టర్ ఫలితాల్లో మోడరన్ విద్యార్థుల ప్రతిభ

పజాశక్తి - రామచంద్రపురం

ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ థర్డ్ సెమిస్టరు ఫలితాలు ఈనెల 10న ప్రకటించారు. రాచంద్రచంద్రపురం పట్టణంలోని లయన్ జివి. రావు డిగ్రీ కాలేజీ విద్యార్థులు అత్యుత్తమ గ్రేడ్ పాయింట్స్ సాధించి యూనివర్సిటీ టాపర్స్‌గా నిలిచారు. ఈ సందర్భంగా మోడరన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లయన్ జి.వి.రావు మాట్లాడుతూ 8.7 గ్రేడ్ పాయింట్స్ నుంచి 9.4 గ్రేడ్ పాయింట్స్ వరకు బిఎస్.సి, బికామ్, బిసిఎకి చెందిన విద్యార్థులు 12మంది యూనివర్సిటీ టాప్ ర్యాంక్‌లు సాధించినట్లు తెలిపారు.

నేడు యథావిధిగా పిజిఆర్ఎస్

ప్రజాశక్తి - అమలాపురం

ప్రజా సమస్యల పరిష్కార వేదిక గ్రీవెన్స్ కార్యక్రమం ఈనెల 12 సోమవారం ఉదయం 10 గంటలనుండి యథావిధిగా కలెక్టరేట్లోని గోదావరి భవన్ లో నిర్వహిస్తారని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ సమస్యలను జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకువచ్చి పరిష్కార మార్గాలు పొందాలని ఆయన విజ్ఞప్తి చేశారు. జిల్లా స్థాయితో పాటు డివిజన్, మండలం, మున్సిపల్ స్థాయి లో కూడా గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. డివిజన్ స్థాయి గ్రీవెన్స్ కార్యక్రమం జిల్లాలోని మూడు రెవెన్యూ డివిజనల్ అధికారుల కార్యాలయాలలో నిర్వహిస్తారన్నారు.

సర్వేశ్వర శర్మకు సైన్స్ పాపులరైజేషన్ అవార్డు

ప్రజాశక్తి - అమలాపురం

హైదరాబాద్‌లోని ఐఐసిటిలోని వివేకానంద ఆడిటోరియంలో ఆదివారం జరిగిన సైన్స్ కాన్ఫరెన్స్‌లో అమలాపురం పట్టణానికి చెందిన ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ సివి.సర్వేశ్వర శర్మకు సైన్స్ పాపులరైజేషన్ అవార్డ్ తెలంగాణ రాష్ట్ర గవర్నర్ ప్రదానం చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకునికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - సీతానగరం

సీతానగరంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆకుమూరి జ్యోతి అనే యువకుడు తీవ్ర గాయాల పాలయ్యాడు. స్థానికుల వివరాల ప్రకారం...జ్యోతి సీతానగరం నుంచి వంగలపూడికి తన బైక్‌పై వెళ్తుండగా, సింగవరం మసీదు సమీపంలో రోడ్డుపై ఉన్న ఇసుక కారణంగా బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన జ్యోతిని వెంటనే రాజమండ్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రాష్ట్రాభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - రామచంద్రపురం

రాష్ట్రాభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. నియోజకవర్గంలో ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మిస్తున్న పలు రోడ్ల నిర్మాణ పనులకు ఆదివారం ఆయన శంకు స్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రామచంద్రపురం నియోజకవర్గం అభివృద్ధి పనుల మీద దృష్టి సారించామన్నారు. రూ.5 కోట్ల ఉపాధి హామీ నిధులతో వెల్ల -ద్రాక్షారామ రోడ్డు నుంచి పసలపూడి కుసుమంబ ఫీల్డ్ వరకు, బాపనయ్య చెరువు పంచాయతీలో వెంకటాయపాలెం గణపతి నగరం రోడ్డుకు, రామచంద్రపురం మున్సిపాలిటీలో కొత్తూరు నుండి మాలపాడు వరకు రోడ్డు, యనమల గ్రామంలో రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలను కూడా అందిస్తుందన్నారు. ఇప్పటికే ఉచిత గ్యాస్ సిలిండర్లను అందిస్తున్నామ న్నారు. మే నెలలో తల్లికి వందనం పథకాన్ని అమలు చేస్తామన్నారు. రైతులకు పెట్టుబడి సాయం జూన్ నెలలో అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నా మని తెలిపారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు కూటమి నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు



ప్రత్యేక రథ యాత్రకు తరలివచ్చిన యాత్రికులు

ప్రత్యేక రథంపై ఊరేగిన సత్యదేవుడు

ప్రజాశక్తి - శంఖవరం

అన్నవరం సత్యదేవుని కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం ప్రత్యేకంగా తయారు చేసిన భారీ రథంపై సతీ సమేతంగా సత్తిదేవుడు ఊరేగాడు. దేవస్థానం ఇఒ వీర్ల సుబ్బారావు, ఛైర్మన్ ఐవి.రోహిత్ కొబ్బరికాయ కొట్టి ఊరేగింపును ప్రారంభించగా అశేష సంఖ్యలో తరలివచ్చిన యాత్రికులు రథాన్ని లాగుతూ స్వామి వారితో పాటు ఊరేగింపులో పాల్గొన్నారు. అనంతరం భక్తులందరికీ స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపి హరీష్‌మాధుర్, రేంజర్ల రాజేష్

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి

ప్రజాశక్తి - తాళ్లరేవు

అంబేద్కర్ ఆశయ సాధనకు యువత కృషి చేయాలని ఎంపి గంటి హరీష్‌మాధుర్ పిలుపునిచ్చారు. ఆదివారం ఇంజరం పరిధిలోని పెదగోవలంక గ్రామంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 134వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. లైఫ్ లైన్ హాస్పిటల్ ఛైర్మన్ భానుమతి అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలో అంబేద్కర్ భావజాల ప్రచారకులు రేంజర్ల రాజేష్ పాల్గొని అంబేద్కర్ ఆశయ జెండాను ఆవిష్కరించి ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపి హరీష్‌మాధుర్ మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని భారీ ఊరేగింపు, మధ్యాహ్నం భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలకు పినిపే శ్రీకాంత్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి కోరుకొండ కిరణకుమారి, బౌద్ధ వివాహకర్త గిడ్ల వీరప్రసాద్, ఎండియుడబ్ల్యుఎ అధ్యక్షులు కన్నీడి వెంకటరమణ, ఉప సర్పంచ్ కోరుకొండ అప్పారావు, న్యాయవాది యడ్ల కుటుంబరావు, కమిటీ ప్రతినిధులు కాట్రు రామ్మూర్తి, కావూరి శ్రీను, కోరుకొండ చంటి, పాము మధు, కోరుకొండ సురేష్, కావూరి విజయ్, తదితరులు పాల్గొన్నారు.

ట్రోఫీని అందుకున్న విన్నర్ జట్టుతో పరిపాలనాధికారి మునిస్వామి

విజేతలకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి స్టేట్ క్రికెట్ అసోసియేషన్ అనుబంధ యానాం క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెట్టకూరు హైస్కూల్ మైదానంలో నిర్వహిస్తున్న సియాచిమ్ క్రికెట్ టోర్నమెంట్ - 2025 ముగిసింది. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్లో అగ్ని లయన్స్‌పై అంబేద్కర్ లెవెన్స్ ఘన విజయం సాధించింది. మొత్తం పది జట్లు పోటీ పడగా విన్నర్‌గా అంబేద్కర్ లెవెన్స్, రన్నర్‌గా అగ్ని లయన్స్ జట్లు నిలిచాయి. మూడో జట్టుగా కెవిఆర్ నిలిచింది. విజేతలకు ప్రాంతీయ పరిపాలనాధికారి మునిస్వామి, సిఐ అడలరసన్ చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పట్టపగలే వీధిలైట్ల వెలుగులు

ప్రజాశక్తి - పెద్దాపురం

పట్టణ పరిధిలో మారుమూల కాలనీ నుంచి మెయిన్ రోడ్డు వరకు పట్టపగలే వీధిలైట్లు వెలుగుతున్నా మున్సిపల్ అధికారులు పట్టించు కోవడంలేదు. అనేక కాలనీలలో రాత్రి సమయంలో లైట్లు వెలగక కాలనీవాసులు అవస్థలు పడుతు న్నారు. కాలనీకి కాలనీకి మధ్య రహదారిలో కూడా లైట్లు వెలగడం లేదు. పొలాలకు సమీపంలోని కాలనీలలో చీకటి పడితే పాములు భయంతో, మరో పక్క కుక్కల భయంతో ప్రజలు తిరగడానికి భయపడుతు న్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పట్టణ పరిధిలో వీధిలైట్ల నిర్వహణపై తనిఖీలు నిర్వహించి వెలగని వీధిలైట్ల స్థానంలో వీధిలైట్లు ఏర్పాటు చేయాలని, పట్టపగలే వెలుగుతున్న వీధిలైట్లను పగలు వెలగకుండా సరిచేయాలని ప్రజలు కోరుతున్నారు.



మెయిన్‌రోడ్డులో వెలుగుతున్న లైట్లు

సామర్లకోటలో డ్వాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

పోలీసుల విస్తృత తనిఖీలు

ప్రజాశక్తి - తాళ్లరేవు, సామర్లకోట

మండలంలోని జార్జిపేట వై-జంక్షన్‌లో పోలీసులు ఆదివారం వాహనాలను తనిఖీలు చేశారు. కాకినాడ రూరల్ సిఐ చైతన్య కృష్ణ ఆధ్వర్యంలో కోరంగి, గొల్లపాలెం ఎస్ఐలు పి.సత్యనారాయణ, మోహన్, సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీలు చేశారు. భారత్- పాకిస్తాన్ మధ్య నెలకొన్న ఘర్షణ వాతావరణం నేపథ్యంలో ఈ తనిఖీలు నిర్వహించారు. అలాగే సామర్లకో రైల్వే స్టేషన్‌లో డాగ్ స్క్వాడ్ బృందంతో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ప్రయాణికుల లగేజీలను క్షుణ్ణంగా పరిశీలించారు. సామర్లకోట సిఐ ఎ.కృష్ణ భగవాన్ ఆధ్వర్యంలో డాగ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహించారు. వాహనాలను తనిఖీలు చేశారు.

పుట్టిన తేదీ ధృవీకరణ ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా, నేను, చామర్తి రవికుమార్, తండ్రి హనుమంతరావు,తల్లి సువర్చల, ఇంటి నెం:2-9 మెయిన్ రోడ్డు, చిలకపాడు గ్రామం, ఉండ్రాజవరం మండలం, ప్రస్తుతం తూర్పుగోదావరి జిల్లాకు చెందిన దంపతులకు చిలకపాడు గ్రామంలో **ది.15/08/1963** వ తేదీన జన్మించి యున్నాను. ఈ తేదీ నా యొక్క పదవ తరగతి మార్కుల మెమో ననుసరించి ధృవీకరించబడినది. కావున, నా జనన తేదీ ధృవీకరణపై ఎవరికైనా, ఏవిధమైన అభ్యంతరాలున్న యెడల నేటినుండి 7రోజులు లోపుగా కొవ్వూరు ఆర్డీవో, ఉండ్రాజవరం తహసీల్దార్, చిలకపాడు గ్రామపంచాయతీ కి గాని తెలియజేయవలసినదిగా కోరుచున్నాను.

చామర్తి రవికుమార్
s/o. హనుమంతరావు, డో.నెం: 14.1.16/2,
నరసాపురం, ప.గో జిల్లా. 524275.
సెల్ నెంబర్.7013643796.